క్లుప్తంగా

పశువులకు వ్యాధి నివారణ చర్యలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

నింద్ర: మండలంలోని పాడి రైతులు పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్యసౌందర్య తెలిపారు. ఆమె బుధవారం పలు గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ముఖ్యంగా పాడి ఆవుల్లో పాల దిగుబడి తగ్గడం, జర్వం, సొంగ కారడం, కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు చేయాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం కల్పలత

పాలసముద్రం: బాల్య వివాహాలు చేయడం, లింగ వివక్ష చూపడం, గృహ హింస చట్టరీత్యా నేరమని ఐకేపీ ఏపీఎం కల్పలత అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం మాట్లాడుతూ, స్త్రీలు, పురుషులు సమానమని, పురుషులతో సమానంగా స్త్రీలను కూడా చదివించాలన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య , శోభ, మంజుల పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న హెచ్‌ఎం, సహచరులు

కార్వేటినగరం: డీఎంపురం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం నాదమునిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన టీచర్లు ఎక్కడ పనిచేసినా అందరి మన్ననలు పొందుతారన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం కేశవులు, ఉపాధ్యాయులు హరిత, సుబ్రమణ్యంరెడ్డి, వెంకటరమణరెడ్డి, డిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, తిరుమలరాజులను శాలువలతో ఘనంగా సన్మానించారు. స్కూలు కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్‌పర్సన్ సంధ్య, సోమసుందరం పిళ్లై, సుధాకర్, ఉపాధ్యాయులు సరస్వతి, మాలతి, కలైవాణి, సుమతి, రాములు, రవి కుమార్, కిషోర్‌కుమార్, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. టీచర్‌కు సన్మానం



వెంకటస్వామిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని ఉగ్రాణపల్లె ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మర్రి మానింటి వెంకటస్వామి బుధవారం ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సహచర టీచర్లు ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. వెంకటస్వామి తొలుత పెనుమూరు మండలంలో బండకిందపల్లె పాఠశాలలో పని చేశారని, 36 ఏళ్ల సర్వీసులో ఎందరో విద్యార్థులకు భవితకు బాటలు వేశారని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఢిల్లీప్రసాద్

పాలసముద్రం : రైతులు భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు భూసార పరీక్ష, ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోవడంతోపాటు దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. గుర్తింపు పొందిన దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. భూసార పరీక్షలు చేసిన తరువాతనే తగిన మోతాదు ఎరువులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని రైతులు, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గొంతునొక్కి.. అభిప్రాయ సేకరణ

తిరుపతి జిల్లా పుత్తూరు మండలం తడుకు పంచాయతీలో రెండు రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ మైనింగ్‌ల లీజు కోసం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. గ్రామ సభలో ఉన్నతాధికారుల సమక్షంలో కూటమి నేతలు ప్రజలు మాట్లాడకుండా వారి గొంతుకలు నొక్కేశారు. స్థానిక ప్రజాప్రతినిధి ఎంపీటీసీ సుబ్బరత్నమ్మకు సమాచారం ఇవ్వకుండా, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఎన్జీవోలు, స్థానిక ప్రజలను మాట్లాడనివ్వకుండా తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- తడుకు క్వారీల లీజు వ్యవహారం
- ఎంపీటీసీ భర్త నిర్బంధం
- ఎన్జీవోలను మాట్లాడనివ్వని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ
- రసాభాసగా పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



మమ్మల్ని ఎందుకు మాట్లాడనివ్వరంటూ ప్రశ్నిస్తున్న పర్యావరణవేత్తలు



గంగాధరంను బలవంతంగా తీసుకెళ్తున్న క్వారీ సిబ్బంది



గంగాధరంను సచివాలయంలో నిర్బంధించిన సిబ్బంది

పుత్తూరు: మండలంలోని తడుకు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా ముగిసింది. సర్పంచ్ వెంకటేశు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ తడుకు రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 182/పీలోని 6 హెక్టార్లలో ఆర్.మధుసూదన్ రావు రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ వారికి, సర్వే నంబర్ 507/2 లోని 2.520 హెక్టార్లు శ్రీకనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ తవ్వకాలకు ఇ-వేలం ద్వారా బిల్డర్లుగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఇందుకు గాను లీజు జారీ చేయడానికి గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. తడుకు పంచాయతీ ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ భర్త గంగాధరం మాట్లాడడానికి ప్రయత్నించగా క్వారీ యజమానుల సిబ్బంది అడ్డుకున్నారు. బలవంతంగా సచివాలయం గదిలోకి తీసుకెళ్లారు. ఏమి చెప్పాలన్నా తమకే చెప్పాలని, సమస్యలను తాము పరిష్కరిస్తామంటూ గంటకు పైగా నిర్బంధించారు. అనంతరం పట్టుబట్టి బయటకు వచ్చిన గంగాధరం ఆర్డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే గుంతకల్లు, తాడిపత్రి నుంచి వచ్చిన పర్యావరణవేత్తల బృందాన్ని సైతం మాట్లాడడానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ అనుమతించకపోవడం చర్చనీయాశమైంది. ఒక దశలో పర్యావరణవేత్తల బృందానికి, క్వారీ యజమానుల సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఈ గందరగోళం మధ్యే సభను ముగించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏడీ మదన్‌మోహన్‌రెడ్డి, ఏఈ శశికళ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్వారీలకు అనుమతులు ఇవ్వద్దు



తడుకు రెవెన్యూ లెక్కదాఖలాలోని సర్వే నంబర్ 182/పి లో దళితులకు డీకేటీ పట్టాలు ఇచ్చారని, అక్కడ క్వారీలకు అనుమతులు ఇవ్వడం ఎంత వరకు సమంజసం. అంతేగాక 14 గ్రామాలకు చెందిన పాడి రైతులు పశువులను మేత కోసం తీసుకువస్తుంటారు. బాంబు బ్లాస్టల వల్ల జరిగే ప్రాణ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు. చుట్టుపక్కల దళిత గ్రామాలు సైతం ఉన్నాయి. క్వారీలకు అనుమతులు ఇవ్వరాదు. ఇచ్చినట్లయితే కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేస్తా.

- వై.గంగాధరం, తడుకు, పుత్తూరు మండలం

ప్రజలకు అవగాహన కల్పించడం మా బాధ్యత



క్వారీల నిర్వహణ వల్ల పర్యావరణంతో పాటు జరిగే పలు అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మా ఎన్జీవోలపై ఉంది. మమ్మల్ని మాట్లాడకుండా అధికారులు అడ్డుకోవడం అప్రజాస్వామికం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. అక్కడ కూడా న్యాయం జరగకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించడానికి కూడా వెనుకాడబోము. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై వుంది.

- ఎన్.రమేష్‌నాయుడు, పర్యావరణవేత్త, గుంతకల్లు

గెస్ట్ లెక్చరర్‌కు దరఖాస్తులు

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు, హిస్టరీ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్టుగాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్లను జిరాక్స్ తీసుకుని ఈ నెల 5వ తేదీలోపు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి ఒక పిరియడ్‌కు రూ.375 వంతున గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు.

పార్టీ అధినేతను కలిసిన కిశోర్ రెడ్డి



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ అధినేతతో కిశోర్ రెడ్డి

గంగాధర నెల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కిశోర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వారు అధినేతను కలిశారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, హామీలు నెరవేర్చకపోవడంపై యువజన విభాగం క్రియాశీలకంగా వ్యవహరించాలని, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని అధినేత తమకు దిశా నిర్దేశం చేశారని కిశోర్‌రెడ్డి తెలిపారు.

శేష వాహనంపై విహారం



శేషవాహనంపై దర్శనమిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి

కార్వేటినగరం: స్థానిక శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో బుధవారం అమ్మవారు శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపదీ మాన సంరక్షణ ఘట్టాన్ని హరికథాగానం చేశారు. మధ్యాహ్నం వాసుదేవరాజు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి క్షత్రియ కులస్తులు సారె సమర్పించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామిని పట్టు వస్త్ర సుగంధ పుష్పాలు, వివిధ రకాల ఆభరణాలతో అర్చకులు కుమారస్వామి ఆచారి ప్రత్యేకంగా అలంకరించారు. ఆ తర్వాత శేష వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కట్ల రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయిరాయల్, అర్చకులు సుమన్, బాబు ఆచారి, కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు..



భక్తులకు అన్నదానం చేస్తున్న వాసుదేవరాజు కుటుంబ సభ్యులు

వరిలో సస్యరక్షణతో అధిక దిగుబడి

నింద్ర: ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు తగిన సస్య రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. ఆయన బుధవారం అగరం, నింద్ర గ్రామాల్లో సాగుచేసిన వరి పంటలను పరిశీలించారు. ఆయన మట్లాడుతూ వరి పంటను పంటను ఆశిస్తే చీడపీడలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

మామిడి రైతులను పట్టించుకోని ప్రభుత్వం

- గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి డిమాండ్



రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి



అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి, నాయకులు

గంగాధర నెల్లూరు: మామిడి రైతుల కన్నీళ్లు పెడుతుంటే ఆదుకోవాల్సింది పోయి కూటమి ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి మండిపడ్డారు. మండల కేంద్రంలోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట బుధవారం కిలోమీటర్ల మేర మామిడి ట్రాక్టర్లతో ఉన్న రైతులతో వారు మాట్లాడారు. రైతుల తమ బాధలు, పడుతున్న కష్టాలను వారికి తెలియజేశారు. ప్రభుత్వం జూన్ 7న ఫ్యాక్టరీ యాజమాన్యాలతో జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ఏ కర్మాగారంలోనూ ఎయిట్ ప్లస్ ఫోర్ ఇవ్వలేదని తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, మే నెలలోనే ఫ్యాక్టరీలతో చర్చించి ఉంటే ఇప్పుడు రైతులకీ కష్టాలు ఉండేవి కావని మండిపడ్డారు. గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని, అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు దొడ్డిదారిలో టోకెన్లు అమ్ముకొని రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. టోకెన్లను రెవెన్యూ అధికారులు సీరియల్‌గా ఇవ్వకుండా వన్ బై వన్ మిస్ చేసి ఇవ్వడం వల్ల ఇలా సొమ్ము చేసుకుంటున్నారు. నిద్రాహారాలు లేకుండా రోడ్లపై మామిడి రైతులు పడిగాపులు కాస్తుంటే కూటమి ప్రభుత్వం వారి జీవితాలను అతలాకుతలం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం ఎయిట్ ప్లస్ ఫోర్ కచ్చితంగా అమలు చేయాలని, మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లాలో మామిడి రైతులు పడుతున్న కష్టాలను నివేదించినట్లు చెప్పారు. అనంతరం రోడ్లపై మామిడికాయల లోడ్లతో వేచి ఉన్న రైతులకు మండల నాయకుల చేతుల మీదుగా అన్నదానం చేశారు. మజ్జిగ, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురవారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, మునిరాజా రెడ్డి, గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, నాయనిరెడ్డి, సురేంద్రారెడ్డి, ఏకాంబరం, యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, ఆర్టీఐ అధ్యక్షులు ఢిల్లీకుమార్, గోవిందరెడ్డి, వేలు మొదలియార్, త్యాగరాజులు, వెంకటేష్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాపార నైపుణ్యాలు అలవర్చుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు: విద్యార్థులు వ్యాపార నైపుణ్యాలను అలవర్చుకోవాలని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి తెలిపారు. కళాశాలలో బుధవారం యూత్ ఫర్ సోషల్ ఇంఫాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాలు, సృజనాత్మకతను వృద్ధి చేయడానికి ప్రభుత్వం ఐక్యరాజ్య సమితిలోని యూనిసెఫ్‌తో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి యూత్ ఫర్ సోషల్ ఇంఫాక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి విద్యార్థీ వ్యాపార రంగంలోనూ విశేషంగా రాణించడానికి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, కోఆర్డినేటర్లు తిరుమలయ్య, నరసింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు.. స్థానిక భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద మంగళవారం తమిళనాడులోని రెడ్‌హిల్స్‌కు చెందిన విజయ్ కుమార్ (62) ద్విచక్రవాహనంలో కేవీబీ పురం నుంచి చెన్నైకి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానికులు చికిత్స నిమిత్తం నగరి ఆస్పత్రికి తరలించారు. అయితే బుధవారం అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. చెన్నై ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని, మృతుడి కొడుకు మణికంఠన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఔషధాల నేరేడు

మనిషికి అవసరమైనవి ఎన్నింటినో ప్రకృతి ప్రసాదించింది. ప్రకృతిలో సీజన్ల వారిగా పలు పండ్లు లభిస్తూ వుంటాయి. వాటిలో మేటిగా అల్లనేరేడు పండ్లను చెప్పొచ్చు. అందులో అనేక ఔషధాలు వున్నట్టు వైద్యులు సైతం చెబుతున్నారు. వాటిలో వుండే యాంటీ యాక్సిడెంట్స్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. కాయలు మాత్రమే కాకుండా చెట్ల ఆకులు, బెరడు కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకే నేరేడు కాయలను తప్పనిసరిగా తినాలని డాక్టర్లు పేర్కొంటున్నారు.

- అల్లనేరేడుతో శరీరానికి చల్లదనం
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు
- మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్న పండ్లు

విజయపురం : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలు తినాల్సిందే. ప్రకృతి ప్రసాదించే పండ్లలో అల్లనేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేసి శరీరానికి చలువను ఇస్తాయి. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి వగరు, తీపి, పుల్లగా ఉంటాయి. మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ఎంతో కీలకంగా పనిచేస్తాయి. నేరేడు పండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్న పని. ప్రస్తుతం ఎక్కువ మంది అల్ల నేరేడు తోటలను పెంచుతున్నారు. అందువల్ల మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. అల్లనేరేడు పండ్లలో ఆయుర్వేద వైద్య విధానపరంగా కూడా అనేక ఔషధ గుణాలు వున్నాయి. నేరేడు పండు తింటే వ్యాధులు దూరమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో మాత్రమే దొరికే అల్ల నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

పోషకాలు ఎన్నో..

అల్ల నేరేడు పండ్లలో క్యాల్షియం, ఐరన్, పొటాషియం, విటమిన్ సి వుంటాయి. వీటిని తరచుగా తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి మూత్ర సమస్యను నియంత్రించడంతోపాటు మధుమేహాన్ని అదుపులో వుంచుతుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ యాక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశింపజేసి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపిస్తాయి. పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది. అల్ల నేరేడు పండ్లలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవీ శరీరంలో అనేక రుగ్మతలను నివారిస్తాయి. సంపూర్ణ ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.



ఆరోగ్యానికి ఎంతో మేలు

అల్ల నేరేడు పండు శరీరానికి ఎంతో మంచిది. వీటితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనిషిలోని పలు రకాల వ్యాధుల నివారణకు ఈ పండు ఎంతగానో దోహదపడుతుంది. వీటిని నానబెట్టి నీరు తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు.

డాక్టర్ విష్ణుప్రియ, పీహెచ్‌సీ విజయపురం

జేఏఓగా విద్యాసాగర్



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న పీఓ రెడ్డెప్ప, ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ ఏడీఎం విభాగం సీనియర్ సహాయకులు విద్యాసాగర్‌కు పదోన్నతి వచ్చింది. డిప్యూటేషన్‌పై ఎస్‌ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు అక్కడే జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏఓ)గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా పర్సనల్ ఆఫీసర్ రెడ్డెప్ప, ఇతర ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.